# కంచే చేనుమేస్తే?...

ఆపొద్దు ఆదివారం. ఆట యిడుపు!

ఆ ముందుటి దినం సందేళకాడ నేను నా సావాసకాపు వెంకటరెడ్డి యిస్కూలునుంచి యింటికొస్తా ఆదివారం తెల్లారే కాడికే ఎలబారిపాయ్ చిలకలకొండ దడిలో బిక్కి పొండ్లు కోసుకోని రావాలనుకుణ్ణాం. చిలకలకొండ మిద్దూరికి తూరుపుగా మూడు మైళ్లు దూరాన ఉండాది. ఆ కొండ దడి నిండా బిక్కి చెట్లే. ఆ చెట్లల్లో మానావరిగా కాపు!

బిక్కి పొండ్లు పైచూపుకు కరక్కాయ మాదిర్తో కనబడతాయి. ఊరికే అట్టా పితికితే చాలు. చిట్లిపోతాయి. లోపల గుజ్జు కాపీపొడి రంగుతో ఉంటింది. తింటావుంటే తీపు పులుపు కలగల్సినట్టు ఆ రుచే రుచిలే! తల్సుకుంటే యిప్పటికి కూడా నోట్లో నీళ్లూర్తా ఉంటాయి.

సరే! ఆపొద్దు తెల్లారే కాడికే ఎవురో ఎంటబడి తరమతా ఉణ్ణెట్టు ఆదరా బాదరా మొకం కడుకుణ్ణా. అంత సద్ది తాగేసినా. వెంకటరెడ్డి దగ్గిరికి పోదామని ఎలబార్తా ఉండా. అంతలోకే మాయమ్మ-

''ఒరే అబ్బోడా! ఈపొద్దు యిస్కూలు లేదు గదరా. మీ అయ్య ఆకుతోటకు కల్ల ఎయ్‌పిస్తా ఉండాడు. కూలోళ్లు ఎంత మంది వచ్చినారో? ఏం పాడో? తెలవకుండాబోతే సంకటెట్టా కెలవాల? పరిగిత్తా పాయ్ కూలోళ్లు ఎంతమంది వచ్చినారో అడిగేసి రాబోరా! నువ్వు వచ్చినాకనే సద్దలు నీళ్లల్లో పొయ్యాల. ఉండే రాగిపిండి చాల్తిందో చాల్దో చూసుకోవాల. యాళకంత సంకటి కెలికి వాళ్ల మొకాన కొట్టకుండా పోతే వాళ్ల రంపు రగలబడి పోతింది. పో! నాయినా! పో!. నా బంగారికొండ గదరా? ఎదా? చూడాల మల్ల. ఎట్టొస్తావో చూడాల. ఈడ ఉణ్ణెట్టే వొక్క అడుగులో వచ్చెయ్యాల్లే!'' అనె.

నిజిం చెప్పొద్దూ! మాయమ్మ మింద నాకు శానా చెడ్డ కోపం వచ్చె. ఆ కోపాన్ని అట్నే ఎలగక్కలేక మింగలేక మినకరిస్తా నిలబడికోని ఉంటే-

''ఇట్టయితే ఎట్రా? ఈ పొద్దు యిస్కూలు గూడా లేదు గదా? ఎప్పుడే పని చేప్పినా యిస్కూలు యిస్కూలంటావ్.. యిస్కూలు లేనప్పుడు గూడా ఈ మాత్రం యింటి కత పట్టించుకోకుండా పోతే నీతో ఎట్టేగేదిరా? ఈ సంసారాలు సాగేదెట్టరా?'' అంటా యాష్ట పాయ.

నిజిమే గదా?

మాఅయ్య మాయమ్మ యిద్దరు అన్నోళ్లు అక్కోళ్లు యిందురు కష్టపడ్తా వుంటే గదా నేను పూసాటుగా తిరగతా ఉండా. అటుమంటప్పుడు యిట్టా చిన్న చిన్న పనులైనా చెయ్‌కుండా పోతే బాగుండదని మడికాడికి పొయ్యొద్దామని ఎలబార్తి.

బిక్కి పొండ్ల కత కొండెక్కి పాయ!

ఊరికి ఉత్తరంగా బాడ్సి మాకల బాయి. ఆ బాయికి తూరుపుగా ఒక గెడ్డ. ఆ గెడ్డ మింద ఒక రాగి మాను. ఆ రాగిమాను కాడ ఉండే కయ్య రాగి మాని కయ్య. ఆ రాగి మాని కయ్యలోనే ఆకుతోట!

చూపు శివుడి మింద చిత్తం చెప్పుల మింద అన్నెట్టుగా మణుసంతా చిలకల కొండమిందుంటే నేను రాగి మాని కయ్య కాడికి నడ్సినా. ఆ కయ్యలో ఆకుతోటకు మాఅయ్య కల్ల ఎయ్‌పిస్తా ఉండాడు.

అ కయ్య సచ్చదరంగా ఉండాది. ఆకుతోట లోపల వొకరు, బయిట నిలబడుకోని వొకరుగా పెండె కట్తా వుంటే ఒక ఆడ మణిసి బందెరాకు అందిస్తా ఉండాది. మా అయ్య ఒక పక్క కూలోడు యింకొక పక్క నిలబడుకోని పెండె కడ్తా వుండారు. అప్పిటికి మా అయ్య కాకుండా ముగ్గురు మొగోళ్లు యిద్దరు ఆడోళ్లు మొత్తం అయిదుమంది పని చేస్తా వుండారన్న మాట!

మా అయ్య నన్ను చూస్తానే ''ఏమిరా అబ్బోడా! దోవ తప్పాయ్ నట్టుండాధి గదరా?'' అని యాసణ్ణం పడె.

''అవునవునయ్యా! దోవ గానా తప్పోకుండా ఉంటే యియ్యరవకు చిలకల కొండ మింద కిలారిస్తా ఉందును. దోవ తప్పే గదా యిట్టొచ్చింది.'' అని చెప్తా మని నోటి దాకా వచ్చె. అయినా వొగిటంటే నాలుగనే రకం మా అయ్య. అని అనిపించుకుండే పీకులాట ఎందుకని కట్తావుండే కల్ల కల్లా చూసినా. ఆ శాతల్లో పని తనం? మోటకు మోకేసినా సరే. తోటకు కల్లేసినా సరే. మాఅయ్య గోయిందు రెడ్డి పని కొట్టొచ్చినట్టు కనిపిస్తానే ఉంటింది. దాన్నే గెమనిస్తా ఉంటే-

''ఈ పొద్దు మాసిన్నోడు మడి కాడి కొచ్చినాడు. అద్దో చిలకల కొండ మింద మెరస్తా ఉండాది. వాన వొస్తిందిరే!'' అంటా మాఅయ్య ముసి ముసిగా నవ్వతా ఉండాడు.

అప్పటికి నాకు కయ్యా గాలవ మొకమే తెల్సెట్టు... నేను అట్టుండే పుల్ల యిట్టా ఎత్తేయ్యనట్టు... అంత ముదిగారంగా నన్ను సాకి సంతరిస్తా ఉణ్ణెట్టు... ఆ పొద్దు నేను మడి కాడికి వచ్చినందుకే వాన రాబోతున్నట్టు! ఆ ఎత్తి పొడుపు మాట్లు యింటా వుంటే నాకు వొళ్లట్నే రగిలె. రగిల్తే మాత్రం ఎగటాయించి మాట్లాడే దానికి ఉండాదా? అందుకనే ''మాయమ్మ కూలోళ్లు ఎంత మందో కనుక్కోని రమ్మనింది'' అని గొణిగినా.

''అదా కత. అట్ట చెప్పు. దినమ్మ నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లు నడ్సి పొయ్యొస్తా సిదగతా ఉండావ్ గదా? ఎంత మందో కనపళ్లా?''

''ముగ్గురు మొగోళ్లు. ఇద్దురాడోళ్లు!''

''అప్పటికి నేనేమయి పోవాల?''

''నిన్ను గూడా కూలోడి కింద లెక్క గట్టి చెప్తే మాయమ్మ పొయ్యిమింద సలసల కాగితా వుండే ఎసుటి నీళ్లెత్తి కొట్టింది నా మొకాన!''

చేసే పని యిడ్సి పెట్టేసి నవ్వతా ఉండాడు మా అయ్య. అదే అదుననుకోని–

''అయ్యా! అయ్యా! కంచే చేను మేసే దంటే అదేందయ్యా?'' అని అడిగితి.

''ఇంటికి తలుపెందుకురా?''

''ఇల్లు బద్రంగా ఉండే దానికి.''

''తోటకు కంచె ఎందుకురా?''

''గొడ్డూ గోదా పడి పైరు మేసెయ్యకుండా ఉండేదానికి!''

''కదా? అటుమంటిది ఆ కంచే చేను మేస్తే?''

''ఎట్టా మేస్తిందయ్యా? కంచెకు నోరేమన్నా ఉండాదా?''

''దానికి నోరుండేది కాదురా యదవా? రచ్చించాల్సింది కంచె. అదే బచ్చిస్తే?'' అంటా శానా సేపు రచ్చించే దాని మింద చెప్పుకోనొచ్చె!

అప్పుడు నాకేం బుర్ర కెక్కలా!

ఇప్పుడు కంచె చేను మేసేది కండ్లారా చూస్తా చెవలారా యింటా ఉంటే బుర్ర గిర్రని తిరిగిపోతా ఉండాది. కడుపు అగోత్రంగా రగిలిపోతా ఉండాది.

కడుపు చించుకుంటే కాళ్లకాణ్ణే పడ్తింది. నీకత నాకత అట్టా యిడ్సి పెట్టు. మనది ఏవుండాది. తూస్తే తూకానికి కొలిస్తే కొల్తకు రాని బతుకులు. కానీ ఆయమ్మ కత అట్టాకాదు గదా? ఇండియాకే ప్రెదాని యిందిరమ్మ! ఆమె కత ఏమాయె? కంచె చేను మేసిన కతగాలా? ఆమాట మణుసులో మెదిలేకుందికి ఆ పొద్దు ఆయమ్మను చంపేసిన నాడు నా గుండెగోడు గుర్తు కొస్తా ఉండాది.

*గొడుగు నీడయే పడగ నీడయై*
*కాటేస్తుందని కలలో గూడా*
*తలంచిన తల్లి కల్పవల్లిరా*
*నమ్మక ద్రోహం పొంచి యున్నదని*
*ఎరుగని వ్యక్తి మహాశక్తిరా*
*ఎరుగని బలికే బలి అయ్యెనురా!*
*అంగరక్షకులు ఆమెకు ఆత్మలు*
*అండగ నిలిచిన దుండుగులిద్దరు*
*అమ్మా! అమ్మా! అంటూ అంటూ*
*వెంట తిరిగిన తుంటరి బుద్దులు*
*గుండెకు గుండ్లను పేల్చినారురా*
*అమ్మను నేలకు కూల్చినారురా!*
*బోసినవ్వుల గాంధీ తాతా*
*శాంతి దూత మా చాచా నెహ్రూ*
*వెంట బెట్టుకొని నేర్పిన నీతులు*
*ఆకళించుకొని అందల మెక్కెను*
*వీర వనితరా! ఇందిరమ్మ రా!*

గుర్తు కొచ్చిన పాట గొంతులో గిరికీలు కొట్తా వుండాది. కనుకొలకుల్లో నీళ్ల తొంగి తొంగి చూస్తా వుండాయి. దోవ కనపళ్లా. మణుసు మాత్రం ఎట్టెటో పోతా వుండాది.

''ఏందో ఈ మాయదారి లోకం. ఎవుడు ఎందుకు ఏం చేస్తాడో అర్తం కానంటా ఉండాది. లేకుండా పోతే గాంధీ మహాత్ముడు ఏం చేసె? ఆయన్ను కాల్చి చంపేసిరి. కడాన కిష్ణపరమాత్తుడు దేముడను కుంటా వుంటే వాడికీ ఒక బోయోడి చేతిలో చావు ముసించె. చూడబోతే పెద్ద పెద్దోళ్ల బతుకులంతా యిట్నే కడతేరి పొయ్యేటట్టుగా ఉండాది.'' అనుకుంటా పోతా పోతా వుండి ఆ నాలుగ్కాళ్లమండపం కాడ అట్టా నిలబడ్తి.

''రేపే మన ప్రియతమ నాయకురాలు ఇందిరా గాంధీ నాలుగో వర్దంతి. ఊరేగింపు బాలాజీ కాలనీ నుండి బయలుదేరి గాంధీరోడ్డు మీదుగా నాలుగ్కాళ్లమండపం కాడికొచ్చి అక్కడ నుండి కోనేటికట్ట మీదికి చేరుకుంటుంది. ఎందరో ప్రముఖులు ప్రసంగిస్తారు. ప్రజలు తండోప తండాలుగా ఈ ఊరేగింపులో పాల్గొని బ్రహ్మాండమైన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మన ఇందిరమ్మ ఆత్మకు శాంతి చేకూర్చాలని అభ్యర్థిస్తున్నాం.''

– అని మైకులో చెప్పుకుంటా పోతా ఉండారు.

''చెయ్యండి చెయ్యండి. బెమ్మాండంగా చెయ్యండి. వద్దన్నె మీ కొడుకు లెవురు?

చేసేసి ఆ మర్నాటి పొద్దన్నే పేపర్లో పేర్లు చూసుకోని చంకలు తట్టుకోండి.'' అని ఒకడు అనె.

''అదేందిరా అట్టంటావే? ఇందిరమ్మ వర్ధంతి గాకుండా మీయమ్మ వర్ధంతి చెయ్యమంటావా?'' అని యింకొకడు తిరుక్కుండె.

''నాయమ్మకా? ఎందుకురా? నాయమ్మ నా కొకడికే అమ్మ. ఇందిరమ్మ అట్టగాదు గదా? ఆమె ఇండియాకే అమ్మ గదా? అయ్యు అయ్యు! ఆమె ఈ దేశానికి వొరగబెట్టింది యింతనా? అంతనా? అందుకే గదరా మన బతుకులు యిట్టా యాడస్తా ఉండేది.''

''ఒరే వొరే! ఇందిరమ్మ శానా తప్పు చేసిందిరా. పోతా పోతా ఈణ్ణి గూడా ఒక రాష్ట్రానికి ముక్కెమంత్రిగా చేసి పారేసుంటే యిప్పుడు ఈ ముక్కులు మూలుగులూ ఉండేటివి గావు.''

''ఇద్దో యిట్టా యితండమంటే కోదండమని మాట్లాడి గదరా మన బతుకులు ఈడికి యాడస్తా ఉండేది.''

''అదేందిరా అట్టా మాట్లాడతావే? బ్యాంకుల్ను జాతీయం చేసిందెవుర్రా? ఆ పని ఆమె గానా చెయ్కుండా పొయ్యుంటే అద్దో వాడికి రిక్సా వొచ్చేదే నంటావా?''

''అదీ పాయింటు. అట్టరా దోవకు నా దేముడూ! ఇందిరా గాందీ బ్యాంకుల్ను జాతీయం చేసింది. నిజమే! దాని వల్ల మనబోటోళ్లకు మిగిలి మిట్టనపడిందేంది? లచ్చలుండే వాళ్లు కోట్లు అప్పు తీసుకున్నారు. యాపారమో సాపారమో చేసుకున్నారు. మత్తేబులై కూసున్నారు. లేదంటే వాడికొక రిక్సా వచ్చిందంటావ్. ఎందుకు? కడంత కాలం ఆ రిక్సానే తొక్కి చావరా నాయినా! అని. అంతకు మించి వొరిగిందేందో చెప్పరా యిందాం!''

''నువ్వు మాట్లాడ్తా ఉండేది శానా అన్నాయపు మాట్లురా? పోనీ! బంగ్లా దేశానికి చేసిన సహాయం చిన్నదంటావా?''

''చిన్నదని చెప్పేదానికి నాకేం సిగ్గు లేదనుకున్నావా? అందుకేగదా ఈ పొద్దు వాడు ఏకు మేకై కూసోనుండేది.''

''ఒరే! మన కొంపల్లో ఉండేది ఉడ్డకు ముగ్గురు తక్కువ. వాళ్లనే మనం అదుపుల్లో పెట్టకోలేక ఏడ్సి చస్తా వుండాం. ఒక ఆడ మణిసి మూతి మింద మీసం వుండే మొగోళ్లకే మొగోడై పాకీస్తాన్ పొండ్లు రాలగొట్లేదంట్రా?''

''ఆమాట నేనేమన్నా కాదన్నానా? ఆమె ముంజేతికి మీసం ఉండాది. పిడికెడంత గుండికాయి గాదు. గుమ్మిడి కాయంత ఉండాది. ఇక ముందు చూపంటావా? ఆ ముందు చూపు ముందర అందురు ముండ మోపులే! ఆ దయిర్నెం... ఆ తెగింపు... అటుమంటి ఆడమణిసి యింక పుట్టదు. పుట్టబోదు. ఆమె అనుకోనుంటే ఈ దేశం సొరూపమే నిమిశంలో మారిపొయ్యుండు. శాతగానోళ్ల కత యిడ్సి పెట్టు. శాతైగూడా చెయ్యలేదనే గదా నా బాద.''

''అంత దూరం ఎందుకు? తెల్లోడు గీసి పెట్టేసి పాయ్‌న ప్లాను. గంగా కావేరీ నదుల్ను కలపాలను కోనుంటే- పదేండ్లు పరిపాలన చేసిన ఆమెకు అదొక లెక్కా పక్కా? అదే చేసుంటే యిప్పుడు ఈ నిరాహార దీచ్చలు... రంపులు రచ్చలు ఉండేటివేనా? తాగే నీళ్ల కోసరం మనకీ తనకలాట ఉండేదేనా?'' ఇంకొకడు వంత పాడె.

''ఒరే అది మంచో చెడ్డో. ఈ వ్యవస్థ ఆమెకు నచ్చింది. దాన్ని కాపాడు కోవాలనుకుణ్ణింది. చుట్టూరా బద్రంగా కంచె యేసి కాపాడు కుణ్ణింది.''

''ఆమె యేసుకుణ్ణె కంచే గదరా ఆమెను మేసేసింది. లేకుండా పొయ్యుంటేనా?''

''చావకుండా ఉంటే ఆ కతే యేరేగా వుండేది లేరా. అయినా మీరంతా కొంపల్లో పెండ్లాలకు సమాదానం చెప్పలేని కుండాకోర్ నాయాండ్లు! మీరే మీసాలుండే మొగోళ్ల మాదిర్తో మాట్లాడ్తా ఉండారు. ఆడమణిసి! ఎంతమందికి సమాదానం చెప్పె. ఎంత మందిని పిడికిట్లో పెట్టుకోని తోలుబొమ్మ లాటాడించె. మొగలాయి పదేడు సమ్మత్సరాలు పగ్గాలు శాతబట్నె? చేత పగ్గం సళ్లొదిలింది ఎప్పుడైనా యిన్నావా? ఈ దేశానికి ప్రపంచంలో ఎంత పేరు తెచ్చెరా?''

''అంత పెద్ద పేరు తెచ్చిన దేశాన్నే అమ్మేస్తే గూడా తీర్సలేని అప్పుగూడా తెచ్చుండ్లా?''

ఇన్నాళ్లూ కడుపు శాత బట్టుకోని నాలుగ్గాళ్లమండపం కాడ చేరేవాళ్ల కంతా కడుపులే గానీ బుర్రలు లేవనుకుంటా ఉంటి. ఈ పొద్దు బుర్రలు గూడా పని చేస్తా ఉండాయని నమ్మకం కుదిరె. అంతలోకే నా బుజం మింద ఒక చెయ్ పడె!

తిరిగి చూస్తే ముత్తారెడ్డన్న!

''ఇంటా ఉండావ్రా అబ్బోడా! అంతా యింటా ఉండాను. కంచే చేను మేసింది. నిజమే! నిజాన్నే నిజమని తేల్సేదానికి నాలుగేండ్లు పట్టింది. ఇదిరా మన నాయం. ఇదిరా మన దేశిం. నాలుగేండ్ల నాటికత యిప్పుడెందుకు కానీ యిప్పటి కత చూడరా. కుల కులానికొక కంచె. ఆ కులాల్లో తెగ తెగకొక కంచె. మత మతానికొక కంచె. ఇంకా మాట్లాడితే బాష బాషకొక కంచె. మొనగోళ్లు ఏస్తా ఉండారు. ఆ కంచెలే మేస్తా వుండాయి. చూస్తా ఉండంగానే ఏమీ ఎరగని అమాయకులు బలై పోతావుండారు. ఇది యిట్నే కొనసాగితే ఏమయి పోతామో ఆలోచించరా ఎర్రోడా! ఆలోచించు!'' అనె.

మాఅయ్య ఆకుతోట కేసిన కంచె రచ్చించే దానికి!

ఇప్పుడు ఈళ్లంతా యేస్తా వుండే కంచెలు బచ్చించేదానికి!

కంచే చేను మేసేదంటే తెల్సుకుండే కాడికి మా అయ్య లేకుండా పాయ.

ఏం చేసేది? ●